AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో..!



2

## హైవేపై బస్సు బోల్తా



2

## మద్యం షాపులకు 35 దరఖాస్తులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 35 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ స్టేషన్ పరిధిలో సోమవారం మొత్తం 36 వైన్ షాప్‌లకు గాను 11 దుకాణాలకు 18 దరఖాస్తులు వచ్చాయి. బోధన్‌లో మొత్తం 18 వైన్ షాప్‌లకు గాను 5 దరఖాస్తులు, ఆర్మూర్‌లో 25 వైన్ దుకాణాలకు గాను ఐదుగురు దరఖాస్తు చేశారు. భీమ్‌గల్ పరిధిలో మొత్తం నలుగురు, మోర్తాడ్ పరిధిలో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తంగా 102 వైన్ షాప్‌లకు గాను ఇప్పటివరకు 35 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.





## ఏడో బెటాలియన్‌లో బ్రహ్మోత్సవాలు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలకేంద్రంలోని ఏడో బెటాలియన్ ఆవరణలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారికి సోమవారం ఉదయం నిత్య వాహనం, వసంతోత్సవం, డోలోత్సవం, బలిహరణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు జరిపించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సాంబశివరావు, అసిస్టెంట్ కమాండెంట్లు శరత్ కుమార్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులపై అడిషనల్ కలెక్టర్ రివ్యూ

**అక్షరటుడే, బోధన్ :** ప్రజలకు సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. బోధన్ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిపై సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అడిషనల్ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో నిర్మించిన కల్వర్టుల నాణ్యతపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణజాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రామారెడ్డి మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో రామారెడ్డి మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్యాక్స్ సొసైటీ డైరెక్టర్ రాజేందర్, గిద్ద గ్రామానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్లు నర్సవ్వ, రాజవ్వ, రమేష్ రెడ్డి పార్టీలో చేరారు. వారితో పాటు సీనియర్ నాయకులు లింబారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మరో 30మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, రామారెడ్డి మాజీ సర్పంచ్ రంగు రవీందర్ ఏఎంసీ డైరెక్టర్ రవూఫ్, మండల ఉపాధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, మండల బీసీ సెల్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు అరవింద్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవాలపై ఫోకస్!

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఆశావహులు పోటీకి ప్రయత్నాలు ప్రారంభించారు. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అనంతరం పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో సర్పంచ్ పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. గెలుపు లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీలు, గ్రామ పెద్దలను మచ్చిక చేసుకొని ఏకగ్రీవం అయ్యేలా ప్లాన్ వేస్తున్నారు. – అక్షరటుడే, కామారెడ్డి



- సర్పంచ్ అభ్యర్థుల నయా స్కెచ్
- గ్రామాభివృద్ధికి డబ్బులు ఇస్తామని హామీ
- ఎన్నికల్లో ఖర్చు కంటే ఇదే బెటర్ అని ఆలోచన
- గ్రామ పెద్దలను మచ్చిక చేసుకుంటున్న పలువురు

కామారెడ్డి జిల్లాలో మొత్తం 532 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తండాలు మినహాయించి అన్ని గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీ) ఉన్నాయి. ఆ గ్రామాల్లో వీడీసీ చెప్పిందే ఫైనల్ అన్నట్టుగా సాగుతోంది. తాజాగా సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేయాలని అనుకుంటున్న వారు వీడీసీ సభ్యులను మచ్చిక చేసుకుంటున్నట్లు సమాచారం. ఎలాగూ ఎన్నికల్లో పోటీ చేస్తే రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయినా గెలుస్తారో లేదో తెలియదు. దీంతో గ్రామాభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇస్తున్నారు. తమను ఏకగ్రీవంగా గెలిపిస్తే ఇన్ని డబ్బులు ఇస్తామని ప్రతిపాదనలు పెడుతున్నట్లు సమాచారం.

### నజరానాపై సస్పెన్స్

గతంలో గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవం అయితే ప్రభుత్వం అదనంగా నిధులు ఇచ్చేది. ఎన్నికలు నిర్వహిస్తే ఎలాగూ ఖర్చు అవుతుంది. ఏకగ్రీవంతో ఆ డబ్బులు మిగులుతాయి. కాబట్టి ఆ నిధులను గ్రామాభివృద్ధి కోసం ఇచ్చేవారు. రానురాను నజరానాకు ప్రభుత్వాలు స్వస్తి పలికాయి. గత ప్రభుత్వ హయాంలో అనేక గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. వాటికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇప్పటికీ ప్రభుత్వ నజరానాపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. మరి ఈ ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలకు నజరానాపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేస్తుందో చూడాలి. ఒకవేళ అదనంగా నిధులు ఇస్తే.. చాలా గ్రామాల్లో ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకునే అవకాశం ఉంది.

### ఎక్కువ నిధులు ఇచ్చిన వారికే..

గ్రామాల్లో గతంలో సైతం ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకునేవారు. ప్రభుత్వాలు సైతం ఏకగ్రీవం అయిన పంచాయతీలకు నజరానా ఇచ్చేవారు. అయితే ఏకగ్రీవం మాటున చాలా గ్రామాల్లో సర్పంచ్ పదవికి వేలంపాట నిర్వహించేవారు. దీంతో ఎక్కువ డబ్బులు పెట్టిన వారు పదవి దక్కించుకునేవారు. ఆ డబ్బులను గ్రామాభివృద్ధికి వినియోగించేవారు. అయితే దీనిపై గతంలో అనేక విమర్శలు వచ్చాయి. మరోసారి పలువురు ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీడీసీలు సైతం ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పినా వారికి పదవిని కట్టబెట్టాలని చూస్తున్నట్లు తెలిసింది.

## పోలీస్ ప్రజావాణికి 18 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ప్రజల చట్టపరమైన సమస్యలను పరిష్కరించేందుకు సీపీ సాయిచైతన్య పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తద్వారా ప్రజలు నేరుగా తమను సంప్రదించవచ్చని సూచిస్తున్నారు. ఈ మేరకు సోమవారం సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ అర్జీలను సీపీకి అందజేశారు. దీంతో తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల సీఐ, ఎస్సైలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య పరిస్థితి, పరిష్కారానికి పలు సూచనలు చేశారు. పోలీస్ ప్రజావాణికి మొత్తం 18 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఇలాంటి పైరవీలకు తావులేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలను



పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

## ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు 26 గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 1,11,270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద తగ్గడంతో అధికారులు దిగువకు నీటి విడుదలను తగ్గించారు. ఆదివారం 37 గేట్లను ఎత్తిన అధికారులు సోమవారం 26 గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 అడుగుల (80.05 టీఎంసీలు) నీరు ఉంది. ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా 1,01,480 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

### నిజాంసాగర్‌లోకి..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 16,507 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద గేట్ల ద్వారా 10,987 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 17.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


### పొంగి పొర్లుతున్న పోచారం

స్థానికంగా కురుస్తున్న వర్షాలతో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాంలోకి ప్రస్తుతం 2,511 క్యూసెక్కుల వరద వస్తోంది. వచ్చిన నీరు వచ్చినట్లు ప్రాజెక్ట్ పైనుంచి పొంగి పొర్లుతోంది.



## రెడ్డిపేట గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** తమ గ్రామానికి ఇప్పటి ఎస్సీ రిజర్వేషన్ రాలేదని, ఈసారైనా అవకాశం కల్పించాలని రామారెడ్డి మండలం రెడ్డిపేట ఎస్సీలు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడ్డిపేట్ గ్రామంలో దశాబ్దాల నుంచి ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు ఎస్సీ రిజర్వేషన్ రాలేదన్నారు. రిజర్వేషన్ రాకపోవడంతో తమకు ఎలాంటి పదవులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కూడా రిజర్వేషన్ కల్పిస్తే గ్రామానికి మంచి చేసే అవకాశం దక్కుతుందని వారు పేర్కొన్నారు.



## పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అక్షరటుడే, బాన్సువాడ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. వర్ని తహశీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. ఏ మాడ్యూల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించబడ్డాయి..? ఇంకా పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయనే విషయాలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఎంత మందికి నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. దరఖాస్తుల్లో క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం చోటు చేసుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో కలెక్టర్‌గా ఆగ్రహించారు. నిర్దిష్ట గడువులోపే అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు కారణాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సాదా బైనామాలు, పీవోటీలకు సంబంధించిన అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, నోటీసులు వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ వేగవంతం చేయాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోజువారీగా సమీక్ష నిర్వహిస్తూ వేగవంతంగా పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## భారీ వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న

పెద్దకొడప్‌గల్ మండలంలో కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు పంట కోతలు మొదలుపెట్టారు. కానీ రాత్రి నుంచి భారీ వర్షం కురవడంతో కోసిన పంటలు నీటిలో మునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు నీటిపాలు కావడంతో ఆందోళన చెందుతున్నారు. - అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్



## బీఆర్ఎస్ హయాంలో మైనర్ ప్రాజెక్టులపై చిన్నచూపు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** బీఆర్ఎస్ హయాంలో మైనర్ ప్రాజెక్టులపై చిన్న చూపు చూడడంతోనే ప్రస్తుత వరదలకు కారణమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎల్లారెడ్డిని అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతుల పంటలు వరదల్లో మునిగిపోగా.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల సమయంలో నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని హరీష్‌రావు ఇప్పుడు తాపీగా వచ్చి 'కాంగ్రెస్‌ను మట్టికరిపిస్తాం' అంటూ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. కష్టాల్లో ఉన్న రైతుల దుఃఖాన్ని రాజకీయ లాభం కోసం వినియోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్ సిల్ట్ రిమూవల్, స్ట్రెంథెనింగ్ పనులు సమయానికి చేయకపోవడం వల్లే భారీ వరదలు భారీ నష్టం కలిగించాయని మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. సుమారు 10వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయన్నారు. పోచారం ప్రాజెక్ట్ పూర్తిగా కొట్టుకుపోయే పరిస్థితి వస్తే.. పోచారం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేయింబవళ్లు కష్టపడి మట్టిసంచులు నింపి, త్రిలింగేశ్వర స్వామి దయతో కాపాడుకున్నామని వివరించారు. 100 ఏళ్లకు పైబడిన ప్రాజెక్టు ఎల్లారెడ్డి ప్రజల గుండెకాయ లాంటిదన్నారు. తన సొంత ఊరు అయిన నల్లమడుగులో చిన్న డ్రెయినేజీ కాలువ కూడా కట్టించుకోలేని జాజాల సురేందర్ ఈరోజు నేను వరల్డ్ బ్యాంక్‌కు వెళ్తే.. ఎద్దేవా చేయడం ఆయనకే చెల్లిందన్నారు. ప్రజలే అధికారం.. ప్రజలకే ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు.





## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**అక్షరటుడే, కోటగిరి :** కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని తహశీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. ఉమ్మడి మండల కేంద్రాల్లోని పీఏసీఎస్ సొసైటీల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 ప్రభుత్వం ధరను నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. దళారులకు నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మహ్మద్ రియాజుద్దీన్, సొసైటీ సెక్రెటరీ శివాజీ, ఏవో నిషిత, రైతులు, దిలీప్ కుమార్, గంట్ల శీను, గంధపు విఠల్, పరశురాం, దత్తు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్–1 సాధించిన యువతికి సన్మానం

**అక్షరటుడే, బాన్సువాడ:** తల్లిదండ్రుల కష్టాన్ని చూసి పెరిగిన మౌనిక.. ఎంతో శ్రమించి పట్టుదలతో డీఎస్పీగా ఉద్యోగం సాధించిందని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు, బాన్సువాడ వాసి పిట్ల శ్రీధర్ అభినందించారు. గ్రూప్-1 ద్వారా డీఎస్పీగా ఎంపికైన వల్లెపు మౌనికను స్వగ్రామమైన ములుగు జిల్లా మల్లంపల్లిలో జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిట్ల శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మౌనిక నిరూపించిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు శివకుమార్, గౌరవ అధ్యక్షుడు రూపాని లోకనాథం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల భవాని, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బోదాస్ రవి, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు మక్కల ధనలక్ష్మి, పిట్ల గోపాల్, శివరాత్రి ఎల్లయ్య, వల్లెపు చంద్రశేఖర్, ఉప్పుతోల్ల కోటి, తురక వీరబాబు, ములుగు జిల్లా అధ్యక్షుడు గండికోట వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు చెరువైంది..



పెద్దకొడప్‌గల్ మండలంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి మొదలైన వాన సోమవారం ఉదయం వరకు కురిసింది. దీంతో పొలాల్లోకి వచ్చిన వరద నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో శివపూర్ నుంచి మండలానికి వచ్చే రోడ్డుపై భారీగా వరద నీరు పారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్



## జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్సు బోల్తా..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ శివారులోని సిరిసిల్ల బైపాస్ రహదారిపై ప్రైవేటు బస్సు బోల్తాపడింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. బస్సు నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా.. పలువురికి గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో బోల్తా .. పలువురికి తీవ్ర గాయాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పరిసరాల్లో సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బిచ్కుంద నుంచి బాన్సువాడ వైపు వస్తున్న ఆటో తాడ్కోల్ శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఆటోలో దాదాపు పది మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులతో పాటు ఆటోపై ఇనుప సామాగ్రి కూడా తరలిస్తుండడంతో అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రమైన గాయాలు కాగా.. వారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులకు గాయాలయ్యాయి.



## ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడు..

**బోధన్ పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ లేకపో వడం, రోడ్లు ఇరుకుగా ఉండడంతో సమస్యలు తలెత్తుతోంది. బోధన్ పట్టణానికి ఒక ట్రాఫిక్ సీఐ, నలుగురు కానిస్టేబుళ్లు ఉన్నా.. సరిపోవడం లేదు. పట్టణంలో వాహనాలతో పాటు గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.**

- అక్షరటుడే, బోధన్

▸ సిగ్నలింగ్ వ్యవస్థలేక ఇబ్బందులు ▸ ఇరుకు రోడ్లతో అవస్థలు

పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. బోధన్ పట్టణం ఆరేళ్ల కిందట 21 చదరపు కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం 41 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. మూడు నుంచి ఐదు కిలోమీటర్ల విస్తీర్ణంలో పట్టణ పరిధి విస్తరించింది. రోజురోజుకు కొత్త కాలనీలు ఏర్పడడంతో పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని సిగ్నలింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు పట్టణంలో ఒక్క సిగ్నల్ వ్యవస్థ కూడా లేదు.

### సిగ్నల్ వ్యవస్థ లేక..

సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రస్తుత బోధన్ పట్టణ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ ఎన్నిసార్లు ప్రభుత్వానికి నివేదించినా.. ఫలితం మాత్రం శూన్యం. పట్టణంలో ఐదు పాయింట్లు సిగ్నల్ వ్యవస్థకు గుర్తించారు. అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, శక్కర్ నగర్ చౌరస్తా, పెగడపల్లి చౌరస్తాలలో తప్పనిసరిగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఏ ఒక్కచోట కూడా సిగ్నలింగ్ వేస్తున్న ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

### ట్రాఫిక్ పీఎస్ ఏర్పాటైతే మేలు..

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. నిధుల కొరత మూలంగానే సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు ఆలస్యం అవుతోంది. అలాగే మార్చిలోగా బోధన్‌కు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు అవుతుంది.

– చందర్ రాథోడ్, ట్రాఫిక్ సీఐ


## అధిక స్థానాలు కైవసం చేసుకోవాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు గెల్చుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో సోమవారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ స్థానాలకు ముగ్గురు చొప్పున పేర్ల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థులకే టికెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యమిస్తామని వినయ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా గౌడ్, రవి ప్రకాష్, ముక్కెర విజయ్, చిన్నారెడ్డి, భూమేష్ రెడ్డి, మార చంద్రమోహన్, ఇస్సపల్లి జీవన్, పవన్ పండిట్, వెంకటరామిరెడ్డి, వెంకటేష్, అశోక్, భోజారెడ్డి, జితేందర్ రెడ్డి, మారుతీ రెడ్డి పాల్గొన్నారు.

## సామాజిక సేవలో జోస్ ఆలుక్కాస్ ముందుండడం అభినందనీయం

**అక్షరటుడే, ఇందూరు:** సామాజిక సేవలో జోస్ ఆలుక్కాస్ సంస్థ ముందడడం అభినందనీయమని మోపాల్ ప్రాథమిక పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రసాద్ అన్నారు. జోస్ ఆలుక్కాస్ తమ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా సుమారు రూ. 2.29 లక్షల విలువైన పాఠశాలకు టీవీ, డ్యూయల్ డెస్క్ బెంచీలు, మైక్ సెట్, ప్రింటర్, వాటర్‌ప్లాంట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం నవనీత మాట్లాడుతూ.. జోస్ ఆలుక్కాస్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకొచ్చి పాఠశాల విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జోస్ ఆలుక్కాస్ నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ ధవిష్, అకౌంట్స్ మేనేజర్ జితిన్, పీఆర్వో పిప్పెర నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, మహేందర్, రాజ్ కుమార్, నాగలక్ష్మి, సుష్మ విద్యార్థులు పాల్గొన్నారు.






## నగరంలో భారీ ట్రాఫిక్ జాం..

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఖలీల్‌వాడిలో సోమవారం భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. నగరంలోని రమేష్ థియేటర్ ఎదురు రోడ్డు వన్ వే చేయడంతో పలు వాహనాలు నలంద కళాశాల ముందు నుంచి వెళ్తున్నాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రులకు వచ్చే వారికి.. స్థానికులకు సైతం వన్‌వేపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఒకసారి ఖలీల్‌వాడిలోకి వచ్చాక తిరిగి వెళ్లే క్రమంలో తికమకపడుతున్నారు. దీంతో సోమవారం సుమారు గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో చాలా ఆస్పత్రులు ఉండడంతో అటువైపు వచ్చే వాహనాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అయితే ప్రధాన ప్రాంతంలోని వన్‌వే చేయడంతో పలువురు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది.

## మళ్లీ కొట్టుకుపోయిన తిమ్మాపూర్ చెరువు కట్ట




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ చెరువు కట్ట మళ్లీ కొట్టుకుపోయింది. రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతంగా రావడంతో తాత్కాలికంగా నిర్మించిన చెరువు కట్ట తెగిపోయింది. ఆగస్టు 28న భారీ వర్షాలకు వచ్చిన వార్తకు చెరువుకట్ట పూర్తిగా ధ్వంసమైంది. చెరువు కింద ఉన్న పొలాలను సంరక్షించేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. పంటలకు సరిపడా నీరు నిల్వ ఉండేలా మరమ్మతులుచేశారు. అయితే ఆదివారం కురిసిన వర్షానికి అటవీ ప్రాంతాల నుంచి భారీ వరదరావడంతో ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి. చెరువు కట్ట తెగిపోవడంతో తిమ్మాపూర్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మరమ్మతులు చేపట్టినప్పటికీ కురుస్తున్న వర్షాలకు కట్టతెగిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చెరువుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## స్థానిక ఎన్నికలకు సమాయత్తమవ్వాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిబ్బంది సమాయత్తం కావాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ అన్నారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని.. ఎలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో పోలీసులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్ సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** నందిపేట్ మండలంలోని కుద్వాన్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు సోమవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన తోట పద్మకు రూ.25వేలు, రఫత్ సుల్తానాకు రూ.27,500 చెక్కులు మంజూరు కాగా.. ఈ మేరకు వారికి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు మంగళారపు తుక్కన్న, గుండు హరీష్, దమ్మాయి శ్రీను, తోట మహేష్, కాంతం చిన్నయ్య, జావేద్, ముజ్జు, ముస్తాక్, తదితరులు పాల్గొన్నారు.



## వైన్స్ టెండర్లలో కొత్తవారికి అవకాశం కల్పించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని 49 వైన్స్ షాపుల టెండర్లలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఆలిండియా అంబేద్కర్ సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం ప్రజావాణిలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైన్స్ టెండర్లలో మూడు, నాలుగేళ్ల నుంచి ఇద్దరు, ముగ్గురు వ్యక్తులదే పెత్తనంగా మారిందని, ఎక్కువ మొత్తంలో షాపులను వారే దక్కించుకుంటున్నారన్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ దుకాణాలకు సైతం బినామీ పేర్లతో టెండర్ వేయించి దుకాణాలను దక్కించుకుంటున్నారని ఆరోపించారు. టెండర్ విధానాన్ని పెద్ద వ్యాపారంగా మలుచుకున్నారని, దీంతో కొత్తవాళ్లకు అవకాశాలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాల్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మడి స్వామి పాల్గొన్నారు.

## ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. నగరంలో గంజాయి విక్రయిస్తున్నా రన్న పక్కా సమాచారం మేరకు సోమవారం నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది దాడి చేశారు. ముగ్గురు గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 7.70కిలోల ఎండు గంజాయి స్వాధీ నం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురిలో ఒకరు ఒడిశా రాష్ట్రానికి చెందిన మైనర్‌గా గుర్తించారు. మిగిలిన ఇద్దరు సిరికొండకు చెందిన వలం వంశీ, తరలి తరుణ్‌గా గుర్తించారు. వారిని రిమాండ్ నిమిత్తం ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. ఒడిశా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, జిల్లాలో విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విలాస్, వెంకటేశ్, ఎస్సై రాంకుమార్, హెడ్ కానిస్టేబుల్ నారాయణరెడ్డి, రాజన్న, భూమన్న, కానిస్టేబుళ్లు భీజన్న, విప్పుడి, అవినాష్, శ్యాం, సాయి, ఉత్తమ్, రాంబచ్చన్, ఆశన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.